RNI No. TGTEL/26/A1458

విశ్వంవాయిస్

ఆవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

ఈ స్థలం [22 సెంట్లు]
అమ్మబడును
భూమి ప్లాట్ నిర్మాణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పాడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భవన.

కె. అబెజ్జేగో (రాజు బాబు) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 1 | సంచిక : 6 | అమీర్‌పేట్ | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 15 ఏప్రియల్ 2026 | పేజీలు : 4 | వెల : 2/-

కేంద్ర నిబంధనలు పాటిస్తే దక్షిణాది రాష్ట్రాలకు

అన్యాయం చేస్తారా?

తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడప వచ్చని అంబేడ్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం నివాళులర్పించారు. అనంతరం ప్రసంగించారు. "గాంధీ, అంబేడ్కర్ దేశానికి రెండు కళ్ల లాంటివారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన మిగతా .. 2లో..

ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి
బహిరంగ లేఖ

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వే షన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్ట వద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ మిగతా .. 2లో..

వచ్చే ఏడాది హరిద్వార్‌లో
కుంభమేళా

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



విశ్వం వాయిస్ న్యూస్ : వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవ్‌భూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని..పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుం దన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. దిల్లీ-దెహ్రాదూన్ ఎకనమిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హై-స్పీడ్, యాక్సెస్-కంట్రోల్డ్ హైవే దిల్లీ-దెహ్రాదూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని
పవర్ ప్లాంట్‌లో పేలుడు
పలువురి మృతి

విశ్వం వాయిస్ న్యూస్ : ఛత్తీస్‌గఢ్‌లోని వేదాంత పవర్ ప్లాంట్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందగా.. 30మందికి పైగా కార్మికులు తీవ్ర గాయాలపాలైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం కార్మికులు పని చేస్తున్న సమయంలో బాయిలర్‌లో వైఫల్యం తలెత్తడంతో ఒక్క సారిగా పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. వెంటనే కార్మికులు బయటకు పరుగులు తీయడానికి ప్రయ త్నించడంతో ప్లాంట్‌లోపల తొక్కిసలాట వంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో మరికొంతమంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా పోలీసులు పెరిగాక
శాఖ పనితీరులోనూ మార్పు : డీజీపీ

నిర్మల్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ : "ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పోలీసు శాఖలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించి అమలు చేస్తున్నారు. సివిల్ విభాగంలో 30 శాతం, ఏఆర్‌లో 20 శాతం చొప్పున వారే ఉండేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగినులు పెరిగాక శాఖ పనితీరులోనూ మార్పు సుస్పష్టమైంద"ని డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని బ్రీఫింగ్‌హాల్‌లో 'పోలీసు అక్క'లతో మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పలు కీలక విభాగాల్లో మహిళలు అధికారులుగా రాణిస్తున్నారని చెప్పారు. అతివలకు అవకాశం కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయనేందుకు ఇది నిదర్శనమన్నారు. మహిళల్లోనూ ఆత్మస్థైర్యం పెరుగుతోందని, సమాజాన్ని చూసే కోణం మారుతోందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో ప్రారంభించిన 'పోలీసు అక్క' కార్యక్రమానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమని, మిగతా .. 2లో..

ఆర్టీసీ సమ్మె నిర్ణయాన్ని
వెనక్కి తీసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని.. ఈ రెండు అంశాలు తప్ప మిగతా సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి మిగతా .. 2లో..

శంషాబాద్ ఎయిర్ పోర్టులో
పేలిన సెల్‌ఫోన్ బ్యాటరీ

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లో సెల్‌ఫోన్ బ్యాటరీ పేలింది. రాయ్‌పూర్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఓ ప్రయాణికుడు వచ్చాడు. అతడి లగేజీని సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా ఫోన్ బ్యాటరీ పేలింది. దీంతో అక్కడున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఇకపై లోక్‌సభలో
850 స్థానాలు..?

విశ్వం వాయిస్ న్యూస్ : నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మిగతా .. 2లో..

మరో 70 ఏళ్లు
తుంగభద్ర 'క్రస్ట్‌గేట్ల'కు ఢోకా లేదు

జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు

హోసపేటె, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి బిగిస్తున్న క్రస్ట్‌గేట్లకు ఎలాంటి నిర్వహణ చేయకపోతే 20 ఏళ్లు, ఏటా నిర్వహణ చేస్తే మరో 70 ఏళ్లు ఎలాంటి ఢోకా ఉండదని జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు మిగతా .. 2లో..

డీల్‌పోయే.. ఖర్చు మిగిలే

హోటల్ బిల్లు కట్టలేక పాక్ అవస్థలు..



విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న ఆ దేశం.. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా ఇబ్బంది కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీనికి సంబంధించిన మీడియా కథనాల ప్రకారం.. పశ్చిమాసియా ఘర్షణలకు ముగింపు పలికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చుకోవాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం మిగతా .. 2లో..

బిహార్ సీఎం నీతీశ్ కుమార్
రాజీనామా

విశ్వం వాయిస్ న్యూస్ : బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్య మంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. లోక్‌భవన్‌కు చేరుకున్న ఆయన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అంద జేశారు. అంతకుముందు క్యాబినెట్ చివరి సమావేశాన్ని ఏర్పాటు చేసి.. మంత్రివర్గ రద్దు విషయాన్ని సహచరులకు తెలియ జేశారు. బిహార్ ముఖ్యమంత్రిగా దాదాపు రెండు దశాబ్దాలు కొనసాగిన నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు, ఎన్డీయే కూటమి మరికాసేపట్లో కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయనుంది. బుధవారం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఇప్పటివరకు మిగతా .. 2లో..

ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

40 నిమిషాలపాటు సంభాషణ



విశ్వం వాయిస్ న్యూస్ : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు మాట్లాడుకున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో మిగతా .. 2లో..

ప్రమాదంలో
యూకే జాతీయ భద్రత

నాటో మాజీ చీఫ్ జార్జ్ రాబర్ట్‌సన్

విశ్వం వాయిస్ న్యూస్ : బ్రిటన్ రక్షణ బడ్జెట్ అంశంపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాటో మాజీ చీఫ్ జార్జ్ రాబర్ట్‌సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ఉదాసీనత, రక్షణ రంగంలో తక్కువ పెట్టుబడుల కారణంగా బ్రిటన్ జాతీయ భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ మిగతా .. 2లో..

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి

అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ : రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అంబేద్కర్ ఉత్సవాలలో పాల్గొన్నారు. తొలుత మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర నిబంధనలు పాటిస్తే దక్షిణాది రాష్ట్రాలకు

అన్యాయం చేస్తారా?

దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసింది" అని సీఎం అన్నారు. "కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం" అని సీఎం తెలిపారు.

ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి

బహిరంగ లేఖ

నిర్వహించాలని కోరారు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని కోరారు. "కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుంది. తక్షణమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలి. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రొరేటా(జనాభా ప్రాతిపదికన), మిగిలిన 50శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థికవృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయాలి" అని రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. ఇదే అంశంపై దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి విడివిడిగా లేఖలు రాశారు.

ఆర్టీసీ సమ్మె నిర్ణయాన్ని

వెనక్కి తీసుకోవాలి

తీసుకువచ్చామని.. ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు పెండింగ్‌లో లేవన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

మహిళా పోలీసులు పెరిగాక

శాఖ పనితీరులోనూ మార్పు : డీజీపీ

ఇది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారు. పోలీసు అక్క, నారీశక్తి, సివంగి.. ఇలా మహిళలే కేంద్రంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రజలు, విద్యార్థులతో మమేకమవుతూ వారిలో ధైర్యం, భరోసా పెంపొందించేలా సమర్థంగా పనిచేయాలని సూచించారు. వీటి అమలుతీరుపై మహిళా ఉద్యోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని డీజీపీ ప్రారంభించి, ఆవరణలో మొక్క నాటారు. పోక్సో కేసుల బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ విభేదాలతో విడిపోయి, భరోసా చొరవతో మళ్లీ ఏకమైన జంటలకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. ఎస్పీ జానకిషర్మిల, నిర్మల్, భైంసా సహాయ ఎస్పీలు సాయికిరణ్, రాజేశ్‌మీనా తదితరులు పాల్గొన్నారు. సోన్ మండల కేంద్రంలో 'అరైవ్- అలైవ్' కార్యక్రమంలోనూ డీజీపీ పాల్గొన్నారు.

బిహార్ సీఎం నీతీశ్ కుమార్ రాజీనామా

ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమ్రాట్ చౌధరీ కొత్త సీఎం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. కేంద్ర సహాయమంత్రి నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది.

ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?

ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

సమావేశం కానున్న ఇండియా కూటమి..

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

మరో 70 ఏళ్లు

తుంగభద్ర 'క్రస్ట్‌గేట్ల'కు ఢోకా లేదు

తెలిపారు. మంగళవారం తుంగభద్ర క్రస్ట్‌గేట్ల బిగింపు పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నెలల్లో 26 గేట్లను బిగించడం మంచి పురోగతి అని కొనియాడారు. మిగిలిన గేట్లను ఈ నెలాఖరులోగా బిగించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ముందుగా వర్షాలు కురిసి, డ్యామ్‌కు వరద వచ్చి చేరినా.. ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. కొత్త గేట్ల బిగింపుతో తుంగభద్ర రైతులకు ఎంతో మేలు కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మొత్తం రూ.51 కోట్లతో పనులు చేపట్టామన్నారు. గేట్ల బిగింపునకు రూ.44 కోట్లు, గొలుసుల తయారీకి రూ.5.1 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.1.34 కోట్లు వెచ్చించినట్లు వివరించారు.

డీల్‌పోయే.. ఖర్చు మిగిలే

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చింది. అందుకు ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్ వేదికైంది. అటు యూఎస్.. ఇటు ఇరాన్ నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. చర్చల్లో ఎలాంటి ఫలితం రాలేదు కానీ.. హోటల్ బిల్లులు మాత్రం మోగిపోయాయని నిఘా వర్గాలను పేర్కొంటూ కథనాలు వచ్చాయి. ఆ బిల్లుల్ని పాక్ ప్రభుత్వం చెల్లించలేదట. సమస్యను పరిష్కరించేందుకు హోటల్ యజమాని రంగంలోకి దిగాల్సి వచ్చిందని రాసుకొచ్చాయి. రెండు దేశాలకు ఆతిథ్యం ఇచ్చినప్పుడు వచ్చే రొటీన్ ఖర్చులు కూడా చెల్లించడంలో పాక్ విఫలమైందని పేర్కొన్నాయి. పాక్ దౌత్య ఆశయాలకు, అంతర్గతంగా నెలకొన్న ఆర్థిక అస్థిరతలకు మధ్య ఎంతో దూరముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సమస్యల నుంచి తాత్కాలికంగా గట్టెక్కేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు ద్రవ్యోల్బణం ఏడు నుంచి తొమ్మిది శాతం మధ్య ఉంది. ఈ సమస్యల మధ్య మరోదఫా యూఎస్-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఏప్రిల్ 21తో రెండువారాల కాల్పుల విరమణ ముగియనుంది. ఈ లోపే ఆ చర్చలు ఉండొచ్చని తెలుస్తోంది.

ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

పరిస్థితులు, భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. "మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షించాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోదీకి ట్రంప్ వివరించారని తెలిపారు.

ప్రమాదంలో యూకే జాతీయ భద్రత

తీరుపై విమర్శలు గుప్పించారు. తాము సంసిద్ధతతో లేమని, తమపై దాడి జరుగుతోందని జార్జ్ రాబర్ట్‌సన్ పేర్కొన్నారు. బ్రిటన్ జాతీయ భద్రత, రక్షణ ప్రమాదంలో ఉన్నాయన్నారు. గతంలో నాటో సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన రాబర్ట్‌సన్.. బ్రిటన్ రక్షణ సామర్థ్యాలను సమీక్షించేందుకు స్టార్మర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి నాయకత్వం వహించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు తక్కువగా ఉండటానికి ప్రత్యర్థి కన్జర్వేటివ్ పార్టీ కారణమని స్టార్మర్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇరాన్ యుద్ధం తమకు మేల్కొలుపు కావాలని స్టార్మర్ చెబుతున్నప్పటికీ.. ఆయన మాటలకు, చర్యలకు పొంతన ఉండటం లేదని నాటో మాజీ చీఫ్ విమర్శించారు. ఆ రంగంలో అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రధాని సుముఖంగా లేరని ఆరోపించారు. సైనికేతర నిపుణులు తీసుకుంటున్న నిర్ణయాలు బ్రిటన్ ఖజానాను ధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అమలాపురంలోని ఎంపీ నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమలాపురం పట్టణం నల్లవంతెన సమీపంలోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమలాపురం రూరల్ భట్నవిల్లి గ్రామంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తదుపరి ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయినవిల్లి మండలం చినతనలంక గ్రామంలో జరిగిన అంబేద్కర్ ఉత్సవాలలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు. కొత్తపేట రెడ్డప్పవారిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేటీఆర్ రాజకీయ చాణక్యం..

చంద్రబాబుపై పొగడ్తల వెనుక పక్కా వ్యూహం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసలు కురిపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ ద్రోహి అంటూ చంద్రబాబుపై తరచూ విమర్శలు గుప్పించే కేటీఆర్ ఆకస్మాత్తుగా గొంతు ఎందుకు సవరించుకున్నారనే అంశమే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బెస్ట్ సీఎం అంటూ చంద్రబాబుతోపాటు వైఎస్ ను కీర్తించడం వెనుక కేటీఆర్ పక్కా రాజకీయ వ్యూహం దాగుందని సందేహిస్తున్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలే లక్ష్యంగా సెటిలర్ల ఓట్లను కొల్లగొట్టాలనే ప్లాన్ తోనే కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేసివుంటారని అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ తోపాటు సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు పాలనను పొగుడుతూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. చంద్రబాబు పాలనతోపాటు టీడీపీ పార్టీ పోరాట పటిమను కేటీఆర్ ప్రస్తావించడం వెనుక ట్రై మున్సిపల్ కార్పొరేషన్లలలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఆకర్షించాలని చూస్తున్నారని అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ తోపాటు కొత్తగా ఆవిర్భవించిన సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు గణనీయంగా ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో సెటిలర్లు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఏపీలో వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డితో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఆయన మద్దతుదారులైన సీమాంధ్రుల ఓట్ల విషయంలో బీఆర్ఎస్ ధీమాగా ఉందని అంటున్నారు. కానీ, గతంలో తమకు అండదండగా ఉన్న సీమాంధ్ర ఓటర్లలోని టీడీపీ సానుభూతిపరుల ఓట్ల విషయంలో బీఆర్ఎస్ లో ఆందోళన నెలకొందని విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉన్న అభిమానంతో టీడీపీ సానుభూతిపరులు ఇక్కడ కాంగ్రెస్ కు బాసటగా నిలుస్తున్నారని అంచనాలు వెలువడుతున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతోపాటు అంతకుముందు పార్లమెంటు ఎన్నికల్లోనూ టీడీపీ సానుభూతిపరులు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపడంతో బీఆర్ఎస్ పార్టీ నష్టపోయిందని అంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన సీమాంధ్రులు ఆ తర్వాత దూరమయ్యారని భావిస్తున్న బీఆర్ఎస్ తిరిగి పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. ఈ కారణంగానే వ్యూహాత్మకంగా చంద్రబాబు విషయంలో తాము సానుకూలంగా ఉన్నామని సంకేతాలు పంపేలా కేటీఆర్ ప్రకటనలు చేస్తున్నారని అంటున్నారు.

డీలిమిటేషన్‌తో నంబర్ గేమ్‌లో సౌత్ ఓటమి!

డీలిమిటేషన్ ఇపుడు దేశంలో అతి పెద్ద చర్చగా మారుతోంది. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు మొదలవుతున్నాయి. అందులో డీలిమిటేషన్ మీదనే చర్చిస్తారు. జనాభా ప్రాతిపదికన కాదు ఇపుడున్న సీట్లకు అదనంగా మరో యాభై సీట్లు దేశమంతా పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. అలా చేసినా ఇలా చేసినా అతి పెద్ద నష్టం సౌత్ స్టేట్స్ కే అని అంటున్నారు దాంతో డీలిమిటేషన్ మీద గొంతు పెంచాల్సింది దక్షిణాది రాష్ట్రాలే అని అంటున్నారు.

మరింతగా తేడా : ఇపుడు దేశంలో 543 లోక్ సభ సీట్లు ఉన్నాయి. అందులో సౌత్ నుంచి చూస్తే 129 సీట్లు మాత్రమే. ఏపీ తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు కేరళ కలుపుకుంటే ఈ సీట్లు అవుతాయి. ఇక వీటిని పక్కన పెడితే మిగిలిన వాటిలో అధిక సీట్లు ఉత్తరాదివి ఉంటాయి. దాంతో తేడా ఏకంగా 400 పైగా వస్తోంది. అయితే ఇపుడు మరో యాభై శాతం అదనంగా సీట్లను పెంచుకోవాలని ప్రతిపాదనకు కనుక ఒప్పుకుంటే ఈ తేడా ఏకంగా 600 పై చిలుకు ఎంపీల తేడా ఉత్తరాదికీ దక్షిణాదికీ మధ్య అవుతుంది. అంటే డీలిమిటేషన్ చేయకముందు కంటే కూడా మరింత అధిక వ్యత్యాసం అన్న మాట.

గొంతు ఎత్తకపోతే : ఇప్పటి నుంచి గొంతు పెంచకపోతే కనుక కచ్చితంగా డీలిమిటేషన్ అన్నది దక్షిణాదికి ఇబ్బంది పెట్టే అంశం అవుతుందని అంటున్నారు. దేశంలో ఇప్పటికి అనేక సార్లు ప్రభుత్వాలు కేంద్రంలో ఏర్పాటు అయితే దక్షిణాది ఎంపీల పాత్ర అందులో కీలకంగా ఉండేది. నేషనల్ ఫ్రంట్ అయినా యునైటెడ్ ఫ్రంట్ అయినా వాజ్ పేయి నాయకత్వంలో ఎన్డీయే సర్కార్ అయినా ఇక 2024 నుంచి కేంద్రంలో నడుస్తున్న మోడీ ప్రభుత్వం అయినా సౌత్ స్టేట్స్ ఎంపీల మద్దతుతో సాగుతోంది. ఈ విధంగా అధిక సీట్లు ఉత్తరాదికి తక్కువగా దక్షిణాదికి అయితే మాత్రం ఇక భవిష్యత్తులో ఎపుడూ దక్షిణాదికి కేంద్రంలో కీలక పాత్ర ఉండదు, అంతే కాదు సౌత్ ఎంపీల మద్దతు ఉన్నా లేకున్నా ఒక్కటే అన్న పరిస్థితి ఏర్పడుతుంది. అది రాష్ట్రాల అభివృద్ధికి ప్రయోజనాలకు కూడా తీవ్ర విఘాతం గా మారుతుంది. అంతే కాదు ఉత్తరాది దక్షిణాది విభజన మరింతగా పెరిగిపోయి కొత్త సమస్యలు సరికొత్త నినాదాలకు కూడా అవకాశంగా మారుతుంది అని మేధావులు హెచ్చరిస్తున్నారు.

రాజకీయాలు పక్కన పెట్టి : ఇక కేంద్రం ప్రవేశపెట్టబోయే డీలిమిటేషన్ బిల్లుకు దక్షిణాది రాష్ట్రాలలో మద్దతు ఇచ్చేది ఎవరు కాదనేది ఎవరు అన్నది చూస్తే కనుక ఆసక్తికరంగా ఉంటుంది. కేరళలో లెఫ్ట్ కాంగ్రెస్ ఎంపీలు అంతా 20 మంది డీలిమిటేషన్ మీద వ్యతిరేకంగా ఉన్నారు. అలాగే డీఎంకే తమిళనాడులో వ్యతిరేకిస్తోంది. డీఎంకే కూటమి మొత్తం 39 మంది ఎంపీలు వ్యతిరేకంగా ఉంటారు. కర్ణాటకలో చూస్తే 27 మంది ఎంపీలు కలిగిన ఎన్డీయే బిల్లుకి సపోర్ట ఇస్తుంది. ఒక్క ఎంపీ ఉన్న కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. తెలంగాణాకు వస్తే కాంగ్రెస్ ఎనిమిది మంది ఎంపీలు మజ్లిస్ ఒక్క ఎంపీ వ్యతిరేకిస్తూంటే 8 మంది బీజేపీ ఎంపీలు సపోర్ట చేస్తున్నారు.

ఏపీ సంగతేంటి :

ఇక ఏపీలో ఎన్డీయేకు 21 మంది ఎంపీలు ఉన్నారు. వైసీపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. అయితే టెక్నికల్ గా ఇది కనిపిస్తున్నా మొత్తం పాతిక మంది ఎంపీలూ బిల్లుకు లోక్ సభలో మద్దతు తెలుపుతారు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే బిల్లుకు అనుకూలంగా 60 మంది ఎంపీల మద్దతు ఉంటే వ్యతిరేకంగా 69 ఉండొచ్చు. అంటే అతి స్వల్ప ఆధిక్యం అన్న మాట. కానీ ఈ విధంగా బిల్లు విషయంలో అనాలోచితంగా మద్దతు ఇస్తే కనుక రాష్ట్రాలు రాజకీయాలు దాటి మరీ దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుంది కాబట్టి మొత్తం 129 మంది ఎంపీలూ ఏకత్రాటిపైకి వచ్చి పోరాడితేనే సౌత్ స్టేట్స్ కి ఫ్యూచర్ లో కేంద్రంలో విలువ నంబర్ గేమ్ లో గెలుపు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు మరి ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.

ఎడిటర్ వాయిస్

బీఆర్ఎస్.. పతనమే తప్ప.. ఉత్థానమెరుగని రాజకీయం!

ఆ ఎన్నికల్లోనూ విజయం దక్కించుకున్నారు. ఇలా రెండు ఎన్నికల్లో -టీఆర్ ఎస్-పేరుతో ఆయన రాజకీయాలు చేశారు. ప్రజలను ఓట్లు కూడా అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రసమితి(టీఆర్ ఎస్) పార్టీని ఏర్పాటు చేసి.. 2001 నుంచి 2022 వరకు ఉత్థాన దిశగా నడిపించిన ఆ పార్టీ సుప్రీం.. మాజీ సీఎం కేసీఆర్.. 2022లో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ సాధన అనంతరం.. 2014లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి అయిన ఆయన.. 2018లో అనూహ్యంగా మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఆ ఎన్నికల్లోనూ విజయం దక్కించుకున్నారు. ఇలా రెండు ఎన్నికల్లో -టీఆర్ ఎస్-పేరుతో ఆయన రాజకీయాలు చేశారు. ప్రజలను ఓట్లు కూడా అభ్యర్థించారు. కానీ.. రెండో సారి అధికారంలోకి వచ్చే సరికి.. కేసీఆర్ ఊహలు.. అంచనాలు మారిపోయాయి. ఇక,తనకు తిరుగులేదని భావించారు. తెలంగాణ ఏముంది.. ఇది ఎప్పటికీ తమకేసొంతమని.. కేంద్రంలో అధికారంలో దక్కించుకుందామని పేకమేడలు కట్టుకున్నారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర సహా.. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఈశాన్యరాష్ట్రం మిజోరాం, అస్సాం.. ఇలా అనేక రాష్ట్రాల్లో పర్యటించి.. జాతీయస్థాయిలో తృతీయ పక్షం ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ఇలా ప్రారంభమైన.. ఆయన జాతీయ రాజకీయ వ్యవహారం.. టీఆర్ ఎస్‌ను.. బీఆర్ ఎస్(భారత రాష్ట్రసమితి)గా మార్చేసింది. తద్వారా జాతీయ స్థాయిలో రాజకీయాలు చేసి.. తాను ప్రధాని కావాలని అనుకున్న మాట వాస్తవం. కానీ.. విధి ఎంత చిత్రమైం దంటే.. టీఆర్ఎస్‌గా ఉన్నంత వరకు నిజానికి కేసీఆర్‌కు ఇటు రాష్ట్రంలోనూ అటు కేంద్రంలోనూ ఏనాడూ తిరుగు లేదన్నదివాస్తవం. అంతేకాదు.. ఆయన మాట కూడాచెల్లుబాటు అయింది. కానీ..ఏనాడైతే.. ఆయన టీఆర్ ఎస్‌ను బీఆర్ ఎస్‌గా మార్పు చేశారో.. ఇక, అప్పటి నుంచి కేసీఆర్‌కు పతనం ప్రారంభమైందని. సొంత పార్టీ నాయకులే వ్యాఖ్యానించిన సందర్భాలు ఉన్నాయి. బీఆర్ ఎస్ గా మారిన తదుపరి రెండు మాసాల్లోనే కుమార్తె కవిత జైలు పాలయ్యారు. కేసీఆర్ కుటుంబాన్ని లిక్కర్ కేసు చుట్టుముట్టింది. ఇక, కేంద్రంపై యుద్ధాన్నిచేయాల్సి వచ్చింది కూడా ఆ తర్వాతే. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి స్వయంగా అప్పటి సీఎంగా కేసీఆర్ ఇందిరా పార్కువద్ద నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీపై బీజేపీ పంజా కూడా విసిరింది. ఇదే -మొయినాబాద్ ఫామ్ హౌస్ ఆపరేషన్-గా పెద్ద ఎత్తున చర్చకు వచ్చింది. ఇక, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం.. అధికారం కోల్పోవడం.. తెలిసిందే. అదేసమయంలో లోక్‌సభ ఎన్నికల్లో 2024లో బీఆర్ ఎస్ అడ్రస్సే గల్లంతైంది. ఇక, సొంత కుమార్తె కవిత తిరుగుబావుటా కూడా కేసీఆర్‌ను కలవరానికి గురి చేసింది. అంతేకాదు.. నమ్మి నెత్తిన పెట్టుకున్న అనేక మంది నాయకులు పార్టీకి దూరమయ్యారు. ఇలా.. టీఆర్ ఎస్‌గా ఉన్న కేసీఆర్ ఒక ద్విగుణీకృత వెలుగు వెలిగితే.. బీఆర్ ఎస్ గా మారిన తర్వాత.. పతమే తప్ప.. ఉత్థానమెరుగని నాయకుడిగా నిలిచిపోయారన్నది వాస్తవం. ప్రస్తుతం బీఆర్ ఎస్‌ను టీఆర్ ఎస్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నామంటూ.. కేటీఆర్ చేసిన ప్రకటన నేపథ్యంలో బీఆర్ ఎస్-టీఆర్ ఎస్ ప్రస్థానాలను ప్రస్తావించడమే ఈ కథనం ఉద్దేశం.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

కాంగ్రెస్ పార్టీయే తెలుగు ప్రజలను

బంట్రోతులుగా చూసింది : కిషన్‌రెడ్డి

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగు ప్రజలను కాంగ్రెస్ పార్టీయే బంట్రోతులుగా చూసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. అంజయ్య, ఇతర సీఎంలను కాంగ్రెస్ పెద్దలు ఎలా అవమానించారో ప్రజలు గమనించారని అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి నష్టమని ఇన్ని రోజులు అన్నారని, జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతుంటే.. ఇప్పుడు కూడా వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. "దక్షిణాదికి కీలక శాఖలు ఇవ్వట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప రాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాది వాళ్లు కాదా? ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోతారని విమర్శిస్తున్నారు. రాహుల్ గాంధీ యూపీ వదిలిపెట్టి.. కేరళకు రాలేదా? దక్షిణాది సీఎంలు వెళ్తే.. రాహుల్ గాంధీ దిల్లీలో అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వట్లేదు. రాహుల్ గాంధీ ఆలోచనలు.. రేవంత్‌రెడ్డి డబ్బుతో కాంగ్రెస్ పార్టీ నడుస్తోంది. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే.. దక్షిణాదికి నష్టమని భావించే మోదీ కొత్త ప్రతిపాదన చేశారు. గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది.. కాంగ్రెస్ పార్టీ కాదా? ఏ పార్టీ అధికారంలో ఉండాలనేది అంతిమంగా ప్రజలు నిర్ణయిస్తారు. ఏ రాష్ట్రానికీ నష్టం జరగకూడదనే 50శాతం నిష్పత్తిలో పెంచుతున్నారు. జనగణన పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది. ఈసారి జనగణనతోపాటు కులగణన చేస్తున్నాం. ఈ రెండూ పూర్తి కావడానికి సమయం ఎక్కువ పడుతుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.

ఎండ తీవ్రత.. ప్రజలకు మంత్రి సీతక్క కీలక సూచనలు

ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచన
మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని సూచన
ఉపాధి హామీ కార్మికులు జాగ్రత్తలు పాటించాలన్న సీతక్క

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : తెలంగాణ వ్యాప్తంగా ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ప్రజలకు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, కాబట్టి ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 11 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని సూచించారు. సాధ్యమైనంత వరకు పనులను ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పూర్తి చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం సమయంలో ఇంటివద్ద ఉండటం మంచిదని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తలకు టోపీ లేదా తలపాగా పెట్టుకోవాలని, శరీరాన్ని ఎండ నుంచి రక్షించుకోవాలని సూచించారు. జాగ్రత్తలు పాటించాలని లేదంటే వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ చలివేంద్రాలను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించామని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు మంత్రి సీతక్క సూచనలు చేశారు. వేసవి కాలంలో పనులు జరుగుతున్నందున కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తలపాగా ధరించడం, సమీపంలోనే తాగునీరు ఉంచుకోవడం చేయాలని అన్నారు. పని స్థలాల్లో మంచినీటి సదుపాయం తప్పనిసరి అని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మీ ఆరోగ్యం మీకే కాదు, ప్రభుత్వానికి కూడా ముఖ్యమే అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకుని పనిచేయాలని అన్నారు.

న్యాయవాదిపై

సీపీకి మంగ్లీ ఫిర్యాదు

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను సింగర్ మంగ్లీ కలిశారు. న్యాయవాది సుబ్బారావుపై ఫిర్యాదు చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తూ కించపరుస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు.

పాదయాత్రకు వెళ్లే ముందు..

కవిత ప్రశ్నలకు సమాధానాలు చెప్పు

కేటీఆర్‌పై మహేశ్ గౌడ్ ధ్వజం
బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందన్న మహేశ్ గౌడ్
కేటీఆర్ ఏం చేసినా ప్రజలు క్షమించరని వ్యాఖ్య
కవిత ద్వారా అన్ని విషయాలు బయటపడుతున్నాయన్న టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై, ఆ పార్టీ అగ్రనేతలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందన ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పదవులు కోల్పోయి విలవిలలాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడంపై స్పందిస్తూ... ఆయన ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను క్షమించే పరిస్థితి లేదని అన్నారు. పదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. కేటీఆర్ పాదయాత్రకు వెళ్లే ముందు, తన చెల్లెలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. సంతోష్ రావు సంతోషం వెనుక ఉన్న రహస్యం ఏంటి? హరీశ్ రావు ఆనందం వెనుక ఉన్న దోపిడీ ఎంత? అనే విషయాలు కవిత ద్వారానే బయటపడుతున్నాయని సెటైర్లు వేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అడుగుతున్న ఆర్థిక లెక్కలకు సమాధానం చెప్పలేక కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని అన్నారు. పదేళ్లపాటు అధికార ముసుగులో అడ్డగోలుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజల ఆదరణ కోల్పోయి పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

70 నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టాం : పొంగులేటి

విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొంగులేటి - ప్రత్యేక కల్లూరు నియోజకవర్గం ఏర్పాటు డీలిమిటేషన్‌పై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్య

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్లతో ఈ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కల్లూరును ప్రత్యేక నియోజకవర్గంగా మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. సత్తుపల్లి ప్రాంతంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని, పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 బోనస్ వంటి పథకాలకు, విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆ సమస్యలకు రామబాణం.. కివి ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు..

కివి పండు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. కంటి చూపు, చర్మ ఆరోగ్యం, బరువు తగ్గడంలో, నిద్ర సమస్యలను నివారించడంలో కూడా కివి పండు కీలక పాత్ర పోషిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. కివి పండులో ఔషధ గుణాలతోపాటు.. పోషకాలు పుష్కలంగా దాగున్నాయి.. కివిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. అందుకే.. కివి పండును సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా, శరీరానికి అవసరమైన విటమిన్-సి కివిలో అధికంగా లభిస్తుంది. దీని గుజ్జులో ఉండే చిన్న నల్లటి విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్లు కూడా ఉంటాయి.. ఇవన్నీ మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. శక్తివంతమైన కివి పండులో ఇందులో విటమిన్ సి (నారింజ కంటే ఎక్కువ), విటమిన్ కె, విటమిన్ ఇ, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎన్నో సమస్యలకు అమృతఫలంగా పేర్కొంటారు.

కివి పండు ప్రయోజనాలు..

వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది: ప్రస్తుత కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం చాలా అవసరం. కివి పండులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రోజువారీ శరీరానికి అవసరమయ్యే విటమిన్-సి మొత్తాన్ని ఒక కివి పండు అందిస్తుంది.

గుండె ఆరోగ్యం: కివి పండు గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.. తద్వారా గుండెపోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా 2-3 కివి పండ్లను తీసుకోవడం వల్ల రక్తం గడ్డకట్టడాన్ని నివారించవచ్చు. ఆస్పిరిన్ టాబ్లెట్ తరహాలో ఇది గుండెకు రక్షణ కల్పిస్తుంది.

ఆస్తమా -అలర్జీల నివారణ: శీతాకాలం సహా.. సీజన్ మారినప్పుడల్లా.. ఆస్తమా, అలర్జీలు ఇబ్బంది పెడుతుంటాయి. కివిలో ఉండే విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఆస్తమా రోగులకు ఉపశమనం కలిగిస్తాయి. గురక, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను తగ్గిస్తాయి.

జీర్ణక్రియ మెరుగుదల: మంచి ఆరోగ్యం కోసం జీర్ణక్రియ సక్రమంగా ఉండటం అత్యవసరం. కివి పండులో డైటరీ ఫైబర్‌తో పాటు, ఆక్టినిడిన్ అనే ఎంజైమ్ ఉంటుంది.. ఇది జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం కివిని ఆహారంలో చేర్చుకోవాలి.

కంటి చూపు మెరుగుదల: నేటి కాలంలో చిన్నపిల్లల్లో కూడా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. కివి పండులో జియాజాంతిన్, లుటిన్ అనే రెండు కాంపౌండ్లు ఉంటాయి. లుటిన్‌ను "ఐ విటమిన్" అని కూడా అంటారు. ఈ రెండు కంటి ఆరోగ్యానికి చాలా మంచివి.. కంటి సంబంధిత వ్యాధులు, క్యాటరాక్ట్‌లు రాకుండా రక్షిస్తాయి. రెటీనా దెబ్బతినకుండా కాపాడుతూ, అధిక కాంతి నుండి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి.

చర్మ ఆరోగ్యం: కివి చర్మ ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే కొల్లాజెన్ ఫైన్ లైన్స్, స్మైల్ లైన్స్ వంటి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కివి పండు గుజ్జును అలోవెరాతో కలిపి రాత్రిపూట ముఖానికి రాసి ఉదయం కడిగేస్తే మొటిమల సమస్య కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి కివి పండు చాలా సహాయకారిగా ఉంటుంది. దీనిలో అధిక నీటి శాతం, తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటాయి. ఈ లక్షణాలు బరువు తగ్గడానికి దోహదపడతాయి.. అదే సమయంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.

మంచి నిద్ర: నిద్రలేమితో (ఇన్సోమ్నియా) బాధపడేవారు తమ ఆహారంలో కివి పండును చేర్చుకోవడం వల్ల మంచి నిద్ర పడుతుందని 2011లో జరిగిన ఒక పరిశోధనలో తేలింది.

ఇతర ప్రయోజనాలు:

కివిలో విటమిన్-సి తో పాటు ఐరన్ కూడా ఉంటుంది కాబట్టి, ఐరన్ లోపం (అనీమియా) ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకారి. కివిని బనానాతో కలిపి తీసుకుంటే అనీమియాను అధిగమించవచ్చు.

ఆహారంలో కివి వినియోగం: అల్పాహారాన్ని దాటవేయడం మంచిది కాదు. తినడానికి ఆసక్తి లేనప్పుడు, కివిని సలాడ్‌గా, స్మూతీగా లేదా స్నాక్‌గా తీసుకోవచ్చు. కివి, దోసకాయ, కొద్దిగా అల్లం కలిపి చేసుకునే జ్యూస్ వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, బరువు తగ్గడానికి, శరీరాన్ని డీటాక్సిఫై చేయడానికి సహాయపడుతుంది. వేసవిలో ఈ జ్యూస్ డీహైడ్రేషన్ నుండి కూడా రక్షిస్తుంది. కివి పండు ప్రస్తుతం అన్నిచోట్లా సులభంగా లభిస్తుంది. దీని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా, మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి ఒక మంచి అడుగు అవుతుందని.. ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

ఈ సినిమా చూస్తున్నంతా సేపు

చాలా బాగా ఎంజాయ్ చేశా..

ఆ హీరో మూవీపై రామ్ చరణ్ ప్రశంసలు

ప్రస్తుతం పెద్ది సినిమా షూటింగ్ పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ఈ సినిమా ఈనెల 30న విడుదల కావాల్సి ఉండంతో ప్రస్తుతం తన సమయం మొత్తం ఈ మూవీకే కేటాయిస్తున్నాడు చరణ్. అయితే ఇంత బిజీలోనూ ఓ తెలుగు సినిమాను చూసి ప్రశంసలు కురిపించాడు మెగా పవర్ స్టార్. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు, సాయి కుమార్, దివ్యేందు త్రిపాఠి, సత్య తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ ఈ మూవీకి స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మెగా మూవీ ఈనెల 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో ఈ సినిమా రిలీజ్ పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నాడు చరణ్. అయితే ఇంత బిజీ టైమ్ లోనూ అడివి శేష్ డెకాయిట్ సినిమాను చూశాడీ మెగా హీరో. అనంతరం నిమాపై తన అభిప్రాయలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. 'ఇప్పుడే డెకాయిట్ సినిమా చూశాను ఈ సినిమా చూస్తూ చాలా బాగా ఎంజాయ్ చేశాను. హరి పాత్రలో శేష్ తన నటనతో మరో లెవెల్ కి తీసుకెళ్లారు. శేష్ నటన చాలా కాలం పాటు గుర్తుండిపోతుంది. మృణాళ్ ఠాకూర్ తన పాత్రకు ప్రాణం పోశారు. ఈ సినిమాకు ఆమె నటనే ఒక పెద్ద అసెట్. వీరే కాకుండా ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన ఇతర నటీనటులు కూడా అద్భుతమైన నటనను కనబరిచారు. సుప్రియ యార్లగడ్డ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ కథను నమ్మి ఎక్కడ రాజీ పడకుండా నిర్మించారు. హైటెక్నికల్ వాల్యూస్ తో సినిమాను ప్రజెంట్ చేసిన విధానం చాలా అద్భుతంగా ఉంది. చిత్ర బృందం మొత్తానికి అభినందనలు' అంటూ రాసుకొచ్చారు రామ్ చరణ్. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట బాగా వైరల్ అవుతుంది. షానియల్ డియో తెరకెక్కించిన డెకాయిట్ సినిమాలో అడివి శేష్, మృణాళ్ జంటగా నటించారు. ఏప్రిల్ 10న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళుతోంది. ఇప్పటికే న్యాచురల్ స్టార్ నాని, నాగ్ అశ్విన్, లేటెస్ట్‌గా రామ్ చరణ్ తదితర సినీ ప్రముఖులు ఈ సినిమాను చూసి ప్రశంసలు కురిపించారు.

ఆ టాలీవుడ్ స్టార్ హీరోతో

అలియా భట్..

పాన్ ఇండియా ప్రాజెక్టులో బాలీవుడ్ బ్యూటీ..

బాలీవుడ్ బ్యూటీ అలియా భట్.. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. అటు హిందీలో ఆమె సినిమాలు తగ్గించేసింది. తాజాగా ఈ బ్యూటీ గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ఆమె మరోసారి తెలుగు తెరపై సందడి చేయనుందనే టాక్ వినిపిస్తుంది. ఇందుకు సంబంధించి పలు విషయాలు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ క్రేజ్ గురించి తెలిసిందే. హిందీలో తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు.. గంగుబాయి కతియవాడి వంటి సినిమాతో జాతీయ అవార్డ్ అందుకుంది. గ్లామరస్ కథానాయికగా.. ఇటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ మెప్పించింది. ఇదివరకే తెలుగులో ఓ సినిమాలో కనిపించి దక్షిణాది సినీ ప్రియుల హృదయాలు గెలుచుకుంది అలియా. తాజాగా ఈ అమ్మడు మరోసారి తెలుగు తెరపై సందడి చేయనుందని టాక్. రాబోయే పాన్ ఇండియా తెలుగు చిత్రంలో ఓ కీలకపాత్రలో ఈ ముద్దుగుమ్మ కనిపించనుందని టాక్. ఆ సినిమాలో ఒక ముఖ్య పాత్ర కోసం అలియా పేరును పరిశీలిస్తున్నారట మేకర్స్. ఇది ఖరారైతే మరోసారి తెలుగు సినీప్రియులను ఈ అమ్మడు అలరించడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా విపరతీమైన బజ్ నెలకొంది. ఎప్పుడెప్పుడు ఆ సినిమా విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అడియన్స్. ఈ క్రమంలోనే మోస్ట్ అవైటెడ్ చిత్రంలో ఇప్పుడు అలియా సైతం భాగమవుతుందనే టాక్ వినిపించడంతో ఆ ప్రాజెక్ట్ పై మరింత హైప్ ఏర్పడింది. ఇంతకీ ఆ ప్రాజెక్ట్ ఏంటీ.? అనే విషయాలు తెలుసుకుందామా. ఎన్టీఆర్ హీరోగా డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న లేటేస్ట్ చిత్రం డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు). కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. ఈ మూవీ కోసం ఎన్టీఆర్ లుక్ పూర్తిగా మార్చేశారు. కండలు తిరిగిన దేహంతో ఇటీవల షేర్ చేసిన ఫోటోతో అభిమానులకు సర్ ప్రైజ్ ఇచ్చారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ డ్రాగన్ సినిమాలో ఓ పవర్ ఫుల్ పాత్రలో అలియా భట్ కనిపించనున్నారట. ఈ సినిమాలో డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఓ పవర్ ఫుల్ పాత్రను డిజైన్ చేశారని.. అందులో కథానాయికగా రోల్ కోసం అలియా పేరు పరిశీలిస్తున్నారని టాక్. గతంలో ఆర్ఆర్ఆర్ చిత్రంలో సీత పాత్రలో కనిపించింది అలియా.

మహేష్ బాబు లాంటి హీరోను ఎక్కడ చూడలేదు..

ఎలాంటి సపోర్ట్ లేకుండా బిల్డింగ్ పై నుంచి దూకేశాడు..

డి.ఓ.పి. యువరాజు మహేష్ బాబు అంకితభావం, సినీ రంగంలో తన ప్రయాణం గురించి ఇటీవల వెల్లడించారు. వన్ నేనొక్కడినే సినిమా షూటింగ్ సమయంలో మహేష్ బాబు డూప్ లేకుండా, 150 అడుగుల ఎత్తు నుండి దూకడం, లైఫ్ జాకెట్ లేకుండా బోట్ ఛేజ్ సీక్వెన్స్‌లో పాల్గొనడం వంటి సాహసాలు చేశారని యువరాజు తెలిపారు. ఆయన వృత్తి పట్ల అంకితభావం, సాహసం సెట్‌లో అందరినీ ఆశ్చర్యపరిచాయని చెప్పారు. సుదీర్ఘ కాలంగా సినీ రంగంలో పనిచేస్తున్న ప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్ (డి.ఓ.పి.) యువరాజు, తమ కెరీర్‌లోని కీలక సంఘటనలు, ప్రముఖ నటులు, దర్శకులతో తమ అనుభవాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. మహేష్ బాబు అంకితభావం, అల్లు అర్జున్ ఎదుగుదల, దర్శకుడు అట్లీ ప్రతిభ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ.) సినిమాటోగ్రఫీపై చూపుతున్న ప్రభావం వంటి అనేక అంశాల గురించి మాట్లాడారు. వన్ నేనొక్కడినే చిత్రం షూటింగ్ సమయంలో జరిగిన రెండు సంఘటనలను యువరాజు వివరించారు. లండన్‌లో జరిగిన ఒక ఛేజ్ సీక్వెన్స్‌లో, మహేష్ బాబు 150 అడుగుల ఎత్తు నుండి డూప్ లేకుండా దూకారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదకరమైన స్టంట్ సెట్‌లో ఉన్నవారందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందని, ఒక చిన్న రోప్‌తో మాత్రమే మహేష్ బాబు ఈ రిస్క్ చేశారని చెప్పారు. రెండవ సంఘటన బోట్ ఛేజ్ సీక్వెన్స్‌కు సంబంధించింది. లైఫ్ జాకెట్ లేకుండా మహేష్ బాబు అత్యంత వేగంగా బోట్‌ను నడిపారని, సుకుమార్ కూడా ఈ విషయాన్ని గతంలో ప్రస్తావించారని యువరాజు గుర్తుచేసుకున్నారు. సీన్‌కు తగ్గట్టుగా లైఫ్ జాకెట్ ధరించడం సాధ్యం కాకపోవడం వల్ల, మహేష్ బాబు ఎంతో ధైర్యంగా ఆ సన్నివేశాన్ని పూర్తి చేశారని, ఇది ఆయన నిజమైన హీరో అని నిరూపించిందని ప్రశంసించారు. ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్‌తో కలిసి లైఫ్ జాకెట్ వేసుకుని బోట్‌లో వెళ్ళినప్పుడు కూడా తమకు భయం వేసిందని, అలాంటిది మహేష్ బాబు ధైర్యం తమకు స్ఫూర్తినిచ్చిందని యువరాజు పేర్కొన్నారు. డి.ఓ.పి. యువరాజు తమ సినీ ప్రస్థానం అల్లు అర్జున్ ఆర్య చిత్రంతో ప్రారంభమైందని, ఆ సినిమాలో తాను చివరి అసిస్టెంట్‌గా పనిచేశానని వెల్లడించారు. అప్పటి నుండి అల్లు అర్జున్ పుష్ప వరకు సాధించిన ఘనత తనకు తెలుసునని అన్నారు. . అల్లు అర్జున్ ఎదుగుదల అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

చెన్నై ఖాతాలో రెండో విజయం.. మరోసారి ఓడిన కోల్‌కతా

కోల్‌కతా నైట్ రైడర్స్ తమ సొంత మైదానమైన చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 32 పరుగుల తేడాతో ఓడిపోయి, జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో తమ నాలుగో ఓటమిని చవిచూసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ తమ సొంత మైదానమైన చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 32 పరుగుల తేడాతో ఓడిపోయి, జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో తమ నాలుగో ఓటమిని చవిచూసింది. మంగళవారం 192 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంతకుముందు, టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ఎంచుకున్న సీఎస్‌కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.

శాంసన్, మాత్రే, బ్రేవిస్‌ల కీలక ఇన్నింగ్స్.. కోల్‌కతా ముందు భారీ టార్గెట్?

ఐపీఎల్ 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్)లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. సీఎస్కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఐపీఎల్ 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్)లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. సీఎస్కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. సంజు సామ్సన్ 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు చేశాడు. డెవాల్డ్ బ్రెవిస్ 29 బంతుల్లో 41 పరుగులు చేశాడు. ఆయుష్ మహాత్రే 17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున కార్తిక్ త్యాగి రెండు వికెట్లు తీయగా, వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్ తలా ఒక వికెట్ పడగొట్టారు.

రెండు జట్లు..

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మ్హత్రే, సర్ఫరాజ్ ఖాన్, డెవాల్డ్ బ్రూయిన్, శివమ్ దూబే, జామీ ఓవర్టన్, నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, గుర్జప్నీత్ సింగ్.

ఇంపాక్ట్ ప్లేయర్లు: మాథ్యూ షార్ట్, అకేల్ హొస్సేన్, కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్, మాట్ హెన్రీ.

కోల్‌కతా నైట్ రైడర్స్: అజింక్యా రహానే (కెప్టెన్), అంగ్క్రిష్ రఘువంశీ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, రింకు సింగ్, రమణదీప్ సింగ్, రోవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి, వైభవ్ అరోరా.

ఇంపాక్ట్ ప్లేయర్లు: ఫిన్ అలెన్, మనీష్ పాండే, తేజస్వి సింగ్, నవదీప్ సైనీ, టిమ్ సీఫెర్ట్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

Published and Edited by Khandavelli Sunilkumar on behalf of Viswam Voice. Published from H.No. 8, 3-430/1/20, Near BSNL Office, Ameerpet, Ali Nagar, Yella Reddy Guda, Hyderabad, Telangana - 500016. Printed at Sri Sai Ganga Printers and Publications, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh - 523001. Registration No: TGTEL/26/A1458